క్లుప్తంగా

ఘనంగా అమ్మవార్ల జాతర



అమ్మవార్ల ఆలయం వద్ద భక్తుల రద్దీ

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంతతోట వద్ద ఉన్న మజ్జిగౌరమ్మ, భద్రకాళి అమ్మవార్ల జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి కుటుంబ సభ్యులు తొలి పూజలు చేసి, పసుపు, కుంకమ, చీర, సారె సమర్పించా రు. అనంతరం అర్చకులు వెంకటరమణ, శ్రీనివాసశర్మ భక్తులతో అమ్మవార్లకు పూజలు చేయించారు. పెదమానాపురంతో పాటు చుట్టు పక్క గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు జగదీష్ నాయుడు ఆధ్వర్యంలో ప్రసాదాలు, మజ్జిగ పంపిణీ చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

24న కొట్టాం గ్రామదేవత పండగ



కోటమ్మకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం గ్రామదేవత కోటమ్మ తల్లి పండగను ఈనెల 24, 25వ తేదీల్లో నిర్వహించనున్నట్టు కోటమ్మ దేవస్థానం ఈఓ జి.శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 24వ తేదీన తొలేళ్ల ఉత్సవం, 25న అనుపోత్సవం నిర్వహించేందు కు గ్రామపెద్దలు, ప్రజలు, పంచాంగకర్తలు నిర్ణయించారని పేర్కొన్నారు. అమ్మవారికి గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



వల్లంపూడి సీతారాముల ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వేపాడ: వల్లంపూడి గ్రామంలో సీతారాముల ఆలయ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. సీతారామలక్ష్మణులకు పురోహితులు రమణమూర్తిశర్మ ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయం వద్ద మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అలాగే రాయుడుపేటలో పరదేశమ్మవారి ఆలయ ప్రాంగణంలో పోతురాజు విగ్రహం ఏర్పాటు చేసిన సందర్భంగా నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.

విద్యతోనే అభ్యున్నతి



స్మార్ట్ క్లాస్ రూమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్

గంట్యాడ: ఏ వ్యక్తి అభ్యున్నతికైనా చదువే మార్గమని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. మండలంలోని మదనాపురం మోడల్ స్కూల్‌లో జూనియర్ కళాశాలకు సంబం ధించి స్మార్ట్ క్లాస్ రూమ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ స్మార్ట్ క్లాస్ రూమ్ విధానం ద్వారా డిజిటల్ అక్షరాస్యత, మాస్ కమ్యూనికేషన్ వృద్ధి చెందుతాయన్నారు. డీఈఓ మాణిక్యంనాయుడు, సమగ్ర శిక్ష ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ రామారావు, స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్.రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

శృంగవరపుకోట: పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో స్థానిక కోలపర్తి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాలకు చెందిన బాయ్స్, గర్ల్స్ హాస్టల్ల విద్యార్థులకు వైద్యసిబ్బంది హెచ్‌బీ, బీపీ, సుగర్ పరీక్షలు, స్కాన్, గ్లూకోజ్ టెస్టులు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని విద్యార్థులకు వైద్యులు సూచించారు. కళాశాల కరస్పాండెంట్ సీహెచ్.ఆర్.కె.ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు, వార్డెన్‌లు, అధ్యాపక సిబ్బంది, కోలపర్తి ఆస్పత్రి ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- కలుషిత నీరు, ఆహారంతో వ్యాధుల ముప్పు
- వడదెబ్బకు గురికాకుండా, వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు





గర్భాం పీహెచ్‌సీ

వేసవి వ్యాధులతో తస్మాత్ జాగ్రత్త...

మెరకముడిదాం: ఎండల తీవ్రత ఒక్కసారిగా పెరిగిపోయింది. మునుపెన్నడూ లేనివిధంగా మార్చిలోనే పగటి ఉష్ణోగ్రతలు ప్రజలను ఉక్కిరి,బిక్కిరి చేస్తున్నాయి. ఉదయం తొమ్మిది గంటలకే భానుడి భగభగలు మొదలవుతుండడంతో ఎండలో బయటకి వెళ్లాలంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రయాణాలు చేసే వారు, వ్యవసాయ,ఇతర పనులు చేసే వారు ఇబ్బంది పడుతున్నారు. మార్చిలోనే ఇలా ఉంటే ముమ్ముందు పరిస్థితి ఇంకా ఎలా ఉంటుందోనని హడలి పోతున్నారు. ఎండల్లో ఎక్కువగా తిరిగే వారు వడదెబ్బకు గురయ్యే ప్రమాదంతో పాటు ఇతర వ్యాధుల బారినపడే ప్రమాదం కూడా వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. వర్షాకాలంలో ఎలా అయితే అంటు వ్యాధులు ప్రబలుతాయో...వేసవిలో వేడిమి వల్ల, కలుషిత నీరు, ఆహారం వల్ల జ్వరాలు, ఇతర వ్యాధులు సోకుతాయని వైద్యులు చెబుతున్నారు. వేసవిలో ఎద్దడి కారణంగా నీరు కలుషితమయ్యే అవకాశాలు ఎక్కువ. ఆహారం కూడా త్వరగా పాడైపోతుంది. కలుషిత నీరు, ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల ఎక్కువ శాతం మంది వ్యాధుల బారిన పడుతుంటారని వైద్యులు అంటున్నారు. వేసవిలో కూడా వైరస్,బ్యాక్టీరియల్ వ్యాధుల ముప్పు పొంచి ఉంటుందని ముందస్తు జాగ్రత్తలు పాటించక పోతే ప్రమాదమేనని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

వడదెబ్బ

తీవ్రమైన ఎండ వేడిమి వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది.దీంతో శరీరంలో ఉష్ణోగ్రతను నియంత్రించే వ్యవస్థ దెబ్బతింటుంది. శరీరంలోని ఎలోక్ట్రోలైట్స్, మినరల్స్, నీటిశాతం తగ్గి సత్తువలేనిస్థితికి చేరడాన్నే వడదెబ్బ అంటారు. శరీర ఉష్ణోగ్రత పెరగడం, చెమట పట్టడం, గుండె వేగంగా కొట్టుకోవడం, కండరాలు గట్టిపడడం, చర్మం ఎర్రగా మారడం, వాంతులు అవ్వడం, మూర్చరా వడం, తలనొప్పి, కోమాలోకి వెళ్లడం లాంటి లక్షణాలు వడదెబ్బ సోకినవారిలో కనిపిస్తాయి.

టైఫాయిడ్

అపరిశుభ్రమైన తాగునీరు, కలుషిత ఆహారపదార్థాలు తీసుకోవడం వల్ల టైఫాయిడ్ జ్వరం వస్తుంది. అతి జ్వరం, అలసట, నిస్సత్తువ, కడుపునొప్పి, తలనొప్పి, ఆకలిలేకపోవడం వ్యాధి లక్షణాలు. అలాగే చర్మ సమస్యలు కూడా తలెత్తుతాయి. శుభ్రమైన మంచినీటిని, ఆహారాన్ని తీసుకోవాలి. బయట దొరికే చిరుతిళ్లు పూర్తిగా మానేయాలి. వైద్యుడిని సంప్రదించి మందులను వాడాలి.

అతిసార

అతిసార (నీళ్ల విరోచనాలు) వ్యాధిపట్ల వేసవిలో అప్రమత్తంగా ఉండాలి.కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల వ్యాధి బారినపడుతుంటారు. ఈ వ్యాధి బారినపడివారిలో కడుపునొప్పి, వాంతు లు, విరోచనాలు, బరువు తగ్గడం, శరీరంలో నీటి శాతాన్ని కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఎక్కువగా విరేచనాలు అవడం వల్ల రోగులు నీరసించిపోతారు. ఈవ్యాధి వల్ల పిల్లలు, వృద్ధులకు చాలా ఇబ్బంది. సకాలంలో స్పందించకపోతే ప్రాణాలకే ప్రమాదం. నిల్వ ఆహారపదార్థాలను తీసుకోకూడదు. పరిశుభ్రమైన నీటిని తీసుకోవాలి. ఎలక్ట్రోల్ పౌడర్‌తో నీటిశాతం, లవణాలు పెంచుకోవచ్చు.

జాగ్రత్తలు

వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు జాగ్రత్తలు పాటించాలి. రోజుకు నాలుగు లీటర్లకు తగ్గకుండా మంచి నీరు తాగాలి. పండ్లు, నిమ్మ రసం, పలచటి మజ్జిగ, కొబ్బరినీళ్లు, చెరకు రసం ఎక్కువగా తీసుకోవాలి. తెల్లటి దుస్తులు ధరించడం శ్రేయస్కరం. కారం, నూనె, మసాలాలు ఎక్కువగా వేసే ఆహారపదార్థాలకు, ఫాస్ట్‌ఫుడ్, మత్తుపానీయాలకు దూరంగా ఉండాలి. వడదెబ్బకు గురైన వారిని గాలి బాగా ఆడే చల్లని ప్రదేశంలోకి చేర్చాలి.శరీరంపై దుస్తులను తొలగించి చల్లని నీటిని చల్లుతూ ఉండాలి. సాధారణ ఉష్ణోగ్రత వచ్చే వరకు తడి గుడ్డతో తుడుస్తూ ఉండాలి. వైద్యుల సలహాతో మందులు వాడాలి.

మలేరియా

ఆడ అనాఫిలిస్ దోమకాటు ద్వారా మలేరియా వ్యాపిస్తుంది. మూడుదశల్లో వ్యాధి ప్రభావం చూపిస్తుంది. మొదటిదశలో అధికచలి, తలనొప్పి, వాంతులు, జ్వరం ఉంటాయి. రెండోదశలో చర్మం వేడిగా, అధికరక్తపోటు ఉంటాయి. మూడో దశలో చెమట పట్టడం, నీరసం, వంటి లక్షణాలు కనిపిస్తాయి. వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకోవాలి. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మితాహారం మంచిది.

చికెన్‌ఫాక్స్ (ఆటలమ్మ)

శరీరంపై నల్లని మచ్చలు వస్తాయి. ఈవ్యాధి కారక వైరస్‌కు వేసవికాలం అనుకూలంగా ఉంటుంది. ఇది అంటువ్యాధి. వ్యాధి బారిన పడినవారిలో తీవ్ర జ్వరం ఉంటుంది. అలసట, ఒంటిపై బుడగలు తేలడం, తలనొప్పి, దురద, ఆకలి తగ్గడం వ్యాధి లక్షణాలు. వ్యాధి నయం కావడానికి కనీసం పదిరోజులు సమయం పడుతుంది. వ్యాధిగ్రస్తులు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి. అంటు వ్యాధి కావడం వల్ల వ్యాధిగ్రస్తులకు వీలైనంత దూరంగా ఉండడం మంచిది.

మీజిల్స్(తట్టు)

ఈ వ్యాధి వేసవిలో ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో చిన్నపిల్లలకు వస్తుంది. పారామిక్స్ వైరస్ కారణంగా వ్యాధి సంక్రమిస్తుంది. గొంతువెనక భాగంలో ఒకపొరలా ఏర్పడుతుంది. తీవ్రమైన జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి, కళ్లు ఎర్రబడడం, నుదిటిపై ఎర్రని మచ్చలు వస్తాయి. వైద్యుడి సలహాలతో మందులు వాడాలి. వ్యాధి సోకినవారి నుంచి పిల్లలను దూరంగా ఉంచాలి.ముందస్తుగా వ్యాక్సిన్ వేయించడం మంచిది

పచ్చకామెర్లు

వేసవిలో వచ్చే పచ్చ కామెర్లు చాలా ప్రమాదకరం. ప్రాణాలు తీసేందుకు కూడా వెనుకాడని ఈ పచ్చ కామెర్ల వ్యాధి నీటి కలుషితం వల్ల, అతి సూక్ష్మమైన క్రిముల వల్ల సోకుతుంది. దీన్ని హెపటైటిస్-ఏ అని కూడా అంటారు. చర్మం పచ్చబడడం, మూత్రం పచ్చగా మారడం, చర్మంపై దురద, ఆకలి మందగించడం. జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, తెల్లని మలం రావడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి.శుభ్రమైన నీటిని తాగాలి, వంటలలో నూనె బాగా తగ్గించాలి.

డెంగ్యూ

ఇదో రకమైన విషజ్వరం. దోమకాటు వల్ల ఒకరినుంచి మరొకరికి వ్యాపిస్తుంది. ఈవ్యాధి రెండుదశల్లో ఉంటుంది. అధిక జ్వరం, తలనొప్పి,కండరాలు, కీళ్ల నొప్పులు తీవ్రంగా ఉంటాయి. పగటి పూట కుట్టే దోమల నుంచి జాగ్రత్తలు పాటించాలి. నివాస పరిసరాలు, పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

గవదబిల్లలు


వైరస్ కారణంగా ఈ వ్యాధి వస్తుంది. ఇది వైరల్ అంటు వ్యాధి. పిల్లల్లో ఎక్కువగా వస్తుంది. లాలాజల గ్రంథులకు వాపురావడం, జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, అలసట, ఆకలిలేకపోవడం ఈవ్యాధి లక్షణాలు. వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ముందస్తుగా ఎంఎంఆర్ వ్యాక్సిన్ వేయించుకోవడం మంచిది.

అప్రమత్తంగా ఉండాలి



వేసవిలో వడదెబ్బకు గురికావడంతో పాటు అనేక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది.అప్రమత్తంగా ఉంటూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. వీలైనంతవరకూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ బయటకు వెళ్లకపోవడమే మంచిది. బయటకు వెళ్లే వారు టోపీ ధరించాలి, వెంట గొడుగు,తాగునీరు తీసుకు వెళ్లాలి. నూనె ఎక్కువగా వాడే వంటకాలను తినకూడదు. ఎక్కువగా నీరు, ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలి. సబ్‌సెంటర్ స్థాయిలో జింక్ ట్యాబ్‌లెట్లు ఇస్తున్నాం. అవి తీసుకోవడం మంచిది.

– కె.అనిల్‌కుమార్, మెరకముడిదాం పీహెచ్‌సీ వైద్యాధికారి



వైద్య, రక్తదాన శిబిరాలు



వైద్య శిబిరంలో సేవలందిస్తున్న ఎన్ఆర్ఐ ఆస్పత్రి వైద్యసిబ్బంది



రక్తదాతలను అభినందిస్తున్న వైస్ ఎంపీపీ రమేష్, నిర్వాహకులు

దత్తిరాజేరు: మండలంలోని పోరలి గ్రామంలో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో ఆదివారం వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. వైద్య శిబిరంలో ఎన్ఆర్ఐ ఆస్పత్రి వైద్యులు 140మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే రక్తదాన శిబిరంలో 30 మంది యువకులు రక్తదానం చేశారు. రక్తదాతలకు, శిబిరాల నిర్వహణకు సహకరించిన వైద్యులు, స్థానిక నాయకులకు సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రేవంత్, సాయికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, ఎన్ఆర్ఐ ఆస్పత్రి పీఆర్ఓ సత్యనారాయణ, సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు రమేష్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



మాజీ ఎమ్మెల్యే అప్పలనర్సయ్యకు కృతజ్ఞతలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు

దత్తిరాజేరు: గజపతినగరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని నూతనంగా నియమితులైన పార్టీ మండలాల అధ్యక్షులకు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య సూచించారు. నియోజకవర్గంలోని గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ,జామి మండలాలకు పార్టీ అధ్యక్షులుగా నియమితులైన బూడి వెంకటరావు, రాపాక కృష్ణార్జున బొద్దల చిన్నంనాయుడు, జాగారపు అప్పారావు,గొర్లె రవికుమార్ విజ యనగరంలో మాజీ ఎమ్మెల్యే అప్పలనర్సయ్యను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమపై నమ్మ కం ఉంచి పార్టీ పదవులు ఇచ్చిన పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్యకు వారు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధినేత నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతగా పని చేస్తామని వారు చెప్పారు.

వివాదాలకు దూరంగా ఉండాలి

గంట్యాడ: యువత వివాదాలు, మత్తుపదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ సాయికృష్ణ సూచించారు. శనివారం రాత్రి గంట్యాడ పంచాయతీ కార్యాలయం వద్ద పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ చట్టాలు, శక్తి యాప్, రహదారి భద్రత , సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న ఎస్ఐ సాయికృష్ణ

బస్సు రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు

వేపాడ: మండలంలో పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఆర్టీసీ 'బడి' బస్సులు నడపనుంది. అయితే గ్రామాల నుంచి పరీక్ష కేంద్రాలకు బస్సులు నడిపేందుకు వీలుగా సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు ఆదివారం రోడ్లకు మరమ్మతులు, తదితర పనులు చేయించారు. కరకవలస పాఠశాల వద్ద విద్యుత్ స్తంభం అడ్డంగా ఉండడం వల్ల బస్సు రావడానికి ఇబ్బందిగా ఉందని ఆర్టీసీ అధికారులు చెప్పడంతో అక్కడి స్తంభాన్ని పక్కకి మార్చారు.

అలాగే దబ్బిరాజుపేట ముత్యాలమ్మ గుడివద్ద రోడ్డుపై గుంతలు పూడ్చారు. వేపాడ చెరుకు కాటావద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలు తొలగించారు. బడిబస్సు జాకేరు, కరకవలస, చామలాపల్లి మీదుగా వేపాడలోని పరీక్షా కేంద్రాలకు వస్తాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

పొట్టిశ్రీరాముల త్యాగఫలితమే ఆంధ్ర రాష్ట్రం

చీపురుపల్లి: అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం వల్లే ఆంధ్ర రాష్ట్రం అవతరించిందని పలువురు వక్తలు అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూని యర్ కళాశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి అధ్యాపకులు సత్యం, రామకృష్ణ, బోధనేతర సిబ్బంది మురళీకృష్ణ, తిరుపతిరావు పూలమా లలు వేసి నివాళులర్పించారు.

గరివిడిలో..

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.వి.యస్. యస్.ఎన్. గుప్త ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు జయంతిని నిర్వహించారు.వాసవీమాత ఆలయం వద్ద ఉన్న పొట్టి శ్రీరాముల విగ్రహానికి ఆయన సంఘ ప్రతినిధులు అమరా సతీష్, సత్యారావు,అప్పలరాజుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చామలవలసలో..

బొండపల్లి: చామలవలసలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి సంఘ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం ట్రెజరర్ పూసర్ల కృష్ణబాబు, తదితరులు పాల్గొన్నారు.

జమ్మాదేవిపేట గురుకులంలో..

లక్కవరపుకోట: జమ్మాదేవిపేట గ్రామ సమీపంలోని జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ విజయకుమార్‌పాత్రో ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఉపాధ్యాయినులు, విద్యార్థినులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: పట్టణంలో ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. గాంధీపార్కు వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి సంఘం అధ్యక్షు డు హెచ్.నానాజీ, సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అదే వేదిక వద్ద ప్రజలకు మజ్జిగ, పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం నేతృత్వంలో చలివేంద్రం ప్రారంభించారు. చలివేంద్రం రెండు నెలల పాటూ కొనసాగుతుందని నానాజీ తెలిపారు. సంఘ సభ్యులు చెక్క కిరణ్‌కుమార్, సహాయకార్యదర్శి బాలనాగు శ్రీనివాస్, ఎస్.కోట మండల కార్యదర్శి సాయి, కొల్లా వెంకటేష్, తోట శీనయ్య, బొండా వెంకటరమణమూర్తి, బొండా రామారావు, విజ్జపు సతీష్, ఆదిమూలం హరీష్, ఎం.శివకుమార్, కె.రవికిశోర్, వేమూరి శ్రీనివాస్, కందుకూరి కల్యాణి పాల్గొన్నారు.

గజపతినగరంలో..

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో స్ఫూర్తి వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు.పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు బొంతల కోటి శంకరరావు, విశ్రాంత ఎంఈఓ ఎం.గంగరాజు, విశ్రాంత ఉపాధ్యాయుడు మానాపురం సత్యారావు, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు ఆరిశెట్టి రమేష్, విశ్రాంత హెచ్ఎం పొట్టా రామారావు, స్ఫూర్తి వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షులు ఎం.సుధాకర్, బి.దామోదరరావు, ప్రధాన కార్యదర్శి శేఖర్, వరదా అప్పలరాజు, ఏడుకొండలు, సాయిసురేష్, అప్పారావు,అప్పలరాజు పాల్గొన్నారు.

కొత్తవలసలో..

కొత్తవలస: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చెరుకూరి నాగరాజు ఆధ్వర్యంలో సంఘ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం సభ్యులు పూసర్ల నాని,మూర్కురి నాని తదితరులు పాల్గొన్నారు.



లక్కవరపుకోట: జమ్మాదేవిపేట బాలికల గురుకుల పాఠశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయినులు



కొత్తవలస: తహసీల్దార్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు



చీపురుపల్లి: జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న విద్యార్థులు



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలో పొట్టి శ్రీరాములు విగ్రహానిని నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు



శృంగవరపుకోట: ఎస్.కోటలో పొట్టి శ్రీరాముల విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్యులు



గజపతినగరం: పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న స్ఫూర్తి వాకర్స్ క్లబ్ సభ్యులు



బొండపల్లి: చామలవలసలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

మెరకముడిదాం: సిరియాలపేట గ్రామ సమీపంలోని మామిడితోటలో ఆది వారం నిర్వహించిన పేకాట శిబిరంపై పోలీసులు దాడులు చేశారు. బుధరాయవలస ఎస్ఐ జె.లోకేష్‌కుమార్ తెలిపిన వివరాలు.. పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.9,600 నగదు, ఆరు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన జూదర్లను సోమవారం చీపురుపల్లి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచనున్నామని ఎస్ఐ చెప్పారు.

ట్రాక్టర్ బోల్తా.. ఆరుగురికి గాయాలు

దత్తిరాజేరు: మండలంలోని సరయ్యవలస సమీపంలో ఆదివారం రాత్రి ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ఆరుగురు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాలు... అనకాపల్లి జిల్లా గొల్లిపాలెం గ్రామానికి చెందిన కూలీలు కొద్ది రోజుల క్రితం నీలగిరి తోటలు కొట్టడానికి శ్రీకాకుళం జిల్లా వెళ్లారు.అక్కడ పని ముగించుకొని పెదమానాపురం సమీపంలో తోటలు కొట్టడానికి ట్రాక్టర్‌పై వస్తుండగా సరయ్యవలస వద్ద ట్రాక్టర్ బోల్తా పడింది. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో ఈప్రమాదంలో గాయపడిన ఎం.రాము, ప్రసాద్, భగవాన్, ఎం.శ్రీను, నగేష్, వి.శ్రీనును 108 సిబ్బంది గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించారు.